# తెల్లబోయిన పడతి

"ఏయ్! మిస్టర్!"

"ఏం?" అన్నట్లు చూశా డతను నడుస్తున్న వాడల్లా ఆగి.

"మీకు అక్కాచెల్లెళ్ళు లేరా?"

"ఉన్నా" రన్నట్లు తల ఊపాడు. చిన్న చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వు చూసిన ఆమెకు చిరాకెత్తింది. కోపం లోలోపల పెల్లుబుకుతూంది. దాని ఛాయలు మటుకు మొగంపై కనపడుతున్నాయి.

"మీకు అమ్మా, నాన్నా లేరా?"

"ఉన్నా" రన్నట్లు తల ఊపాడు. మళ్లీ సన్నని చిరునవ్వు చిందించాడు.

"తమ్ముళ్లు లేరా?"

"ఉన్నా" రన్నట్లు తిరిగి తల ఊపాడు. మళ్లీ ఆ సన్నని చిరునవ్వే ప్రత్యక్షం.

అతని తీరు, వాలకం, ఆ చిరునవ్వు చూసిన ఆమెకు తగని చిరాకెత్తింది. ఆమెలో కోపం పొంగి పొరలుతూంది. మనస్సు, శరీరం ఆమె అధీనంలో లేవు. తడబడుతూంది.

'ఎన్ని ప్రశ్న లడిగినా ఒక్కదానికి జవాబు చెప్పడేం? అదొక తమాషా? లేక అదొక నటనా? ఏమి టీ వేషం? వెధవ వేషాలూ వీడూను! ఆడపిల్లల వెంట పడి వాళ్లను ఏడిపించటం పెద్ద తమాషా కాబోలు! పెద్ద ఘనకార్యం కాబోలు వీళ్లకు! అయినా అసలు మాట్లాడడేమిటి? ఒకవేళ మాట్లాడితే తన నోటి ముత్యాలు రాలిపోతా యని భయమా! లేక పదహారు పళ్లు బయటికి కని పిస్తాయని భయమా? ఏమిటి ఈ విచిత్ర ధోరణి?' అన్న ఆలోచనలు కిందికి పైకి పడుతూ లేస్తూ ఆమెకు చిరాకు కలిగిస్తున్నాయి.

తిరిగి అడుగుదామని తల తిప్పేసరికి ఆమెకు తిరిగి అతని సన్నని చిరునవ్వే ప్రత్యక్షమయింది. అది చూచేసరికి ఉన్న సహనం కాస్తా ఎగిరిపోయింది ఆమెలో. ఇక ఆపలేక అతన్ని అడిగింది ఆమె.

"ఏయ్! మిస్టర్!"

"ఏం?" అన్నట్లు తిరిగి అతని చూపు, అతని చిరునవ్వు ప్రత్యక్షం.

"ఇది మీకు మంచిదా?" అని అడిగింది ఆమె.

"ఏది?" అన్నట్లు చూపులతో అడిగాడు అతను.

ఆ చిలిపికన్నులు తనను వెక్కిరించినట్లు భావించింది. పైగా తనను పరీక్షిస్తున్నట్లు భావన కలిగింది ఆమెకు. ఆమెలోని కోపం ఫెళఫెళమంటూ గాలి తుఫానులా బయటికి విరుచుకొనిపడింది.

"ఇలా ఆడపిల్ల వెంట పడడం, వాళ్లను ఏడిపించడం—ఇది మీకు ఘనకార్యమా! ఎందు కిలా నన్ను వెంటాడుతారు? మీకు సిగ్గులేదూ? పరువు మర్యాదలు లేవూ?

"మీ కొక చెల్లెలుండి, ఆమె వెనక ఇలా మీలా ఎవరైనా వెంటపడితే మీరు ఏం చేస్తారు? చూస్తూ ఊరుకుంటారా? లేక ఆ పెద్దమనిషికి నాలుగు చివాట్లు పెడతారా? ఏం, మాట్లాడరు?

"మీకు మానాభిమానాలు లేవూ? ఓపిగ్గా నా మాటలు అన్నీ వింటూ నన్ను విసిగిస్తారా? నన్ను అల్లరి చెయ్యడం ఎందుకు? ఇకనైనా తమరు బుద్ధిమంతుడిలా నన్ను వెంటాడక తిరిగిపొండి. లేకపోతే నలుగురిని పిలిచి అల్లరి చెయ్యవలసి వస్తుంది" అని గబగబా పంపునీళ్లకు మల్లే మాటలు అనేసింది ఆమె.

అన్ని శాపనార్థాలు, తిట్లు విన్నప్పటికి అతను ఏమీ చెక్కుచెదరలేదు. ఓపిగ్గా (ఆమె అన్నట్లు) అన్నీ విన్నాడు. ఏమీ మాట్లాడలేదు. కదలలేదు. మెదలలేదు. భయచిహ్నాలు కాని, లజ్జాఛాయలు కాని అతనిలో కనిపించడంలేదు. నిర్భయంగా, నిటారంగా నిల్చుని ఉన్నాడు. చిరునవ్వు అతని పెదాలపై తొంగి చూస్తూంది.

"నేను నా దారిని పోతున్నాను. మీ వెంట పడలేదు. మీరు అలా భావించి ఉంటారు నన్ను" అన్న భావనలు స్ఫురించేలాగ ఆమెకేసి చూచాడు అతను.

ఆ చిలిపికన్నుల భావపరంపరలు ఆమెకు అర్థం కాలేదు. ఆ చూపులు ఆమెకు ముళ్లలా గుచ్చుకొంటున్నాయి. వాటిని భరించలేక పోతున్నది. ఏం చేస్తుంది, పాపం! తప్పదు అన్నట్లు ఏం చెయ్యలేక నిస్సహాయురాలై భరిస్తూంది. భరించింది. తను ఇన్ని మాటలు అన్నా ఏమీ చలించక తిరిగి తనకేసి ఆ కొంటెచూపులు విసరడం ఆమెకు చిరాకెత్తించింది.

'అసలు ఇతను మనిషా? లేక పశువా? రాయా? రాయే నయం దెబ్బ వేస్తే పక్కన లొంగుతుంది! అంతకన్న విపరీతంగా ఉంది. ఏమిటి ఈయన పోకడ? ఇంతసేపు తనుఅన్నమాటలు గాలిలో కలిసిపోవలసిందేనా? వాటికి ప్రభావం లేదా? చలనం లేదా? ఈయనగారి తీరు చూస్తూంటే అలా అనుకోవలసి వస్తున్నది. అలా కాకూడదు. తనంటే ఎవరో అతనికి చెప్పాలి. ఆడది అంటే అబల కాదు సబల అని బుద్ధి చెప్పాలి. పడతి అంటే కరిగిపోయే పంచదార చిలక కాదు అని చెప్పాలి. ఎలా?

'అతని వాలకం, ఆ చూపులు, ఆ చిరునవ్వు—వాటి నేను చూస్తూంటే ఒళ్లు నా దగ్గిర ఉండనంటున్నది. కాని, ఎలా? ఎలా బుద్ధి చెప్పాలి?' ఇలా ఆలోచించ సాగింది. ఆలోచించి, ఆలోచించి ఆమె ఏం చెయ్యడానికి తోచక, ఏం చెయ్యలేక నిస్పృహతో తిరిగి నడక సాగించింది. గబగబా నడుస్తున్నది.

'ఆమె తన చూపుల భావం అర్థం చేసుకొన్నది. అందుకే తన ఆపోహ సరిఅయినది కాదని తల వంచి మళ్లీ ఏం మాట్లాడకుండా నడచిపోతున్నది. పాపం! చాలా అమాయికురాలు. వట్టి అనుమానం మనిషి లాగున్నది. భయస్థురాలు కూడా నేమో!' అని తలపోయ సాగాడు అతను నడుస్తూ.

దీనికి విరుద్ధ ఫలితంగా ఆమె ఆలోచిస్తున్నది. 'ఎలా అతనికి బుద్ధి చెప్పాలి?' అన్నదే ఆమె దీర్ఘాలోచన.

## 2

మైలురాయి దాటారు. అనుమానం వచ్చి ఆమె వెనుతిరిగి చూచింది. చాలా ఆశ్చర్యపోయింది. గుడ్లు మిటకరించింది. పళ్ళు పటపట కొరికింది. కోపంతో భూమిని ఒక తన్ను తన్నింది.

ఆమె అలా మారడానికి కారణం ఏమంటారు?

ఏమీ లేదు. ఆమె వెనకనే అయిదారు గజాల దూరంలో అతను కూడా తల వంచి గబగబా నడుస్తూ వస్తున్నాడు.

ఆమె సహనాన్ని కోల్పోయింది. కోపం తారాజువ్వలా పైకి లేచింది. ఒడలు కంపించసాగింది. గాలికి తల వెంట్రుకలు ముఖం మీద పడ్డాయి. వాటిని వెనక్కు తోస్తూ చేతిలోని బాగు కిందపెట్టింది.

రెండు నిమిషాలు అలా నిల్చున్నది.

విశ్రాంతి కొరకేమో?

కాదు. అతని రాకకోసమేమో?

ఏమైనా ఆ రెండు నిమిషాలు ఆగితే తెలుస్తుందిగా ఆమె ఎందుకు ఆగిందో?

ఆమెలో మటుకు ఆలోచనాస్రవంతి మరీ జోరుగా ప్రవహిస్తున్నది.

'ఎలా? ఎలా బుద్ధి చెప్పాలి? ఏమి టీ మనిషి వైఖరి? నా దగ్గిర ఏమున్నదని నా వెంట పడ్డాడు? బంగారు నగలు లేవే? మరి ఎందుకు నా వెంట పడ్డాడు? ఏమో! ఎవరికి తెలుసు?

'ఏమిటి అతని ధీమా? ఎలా ఇతన్ని వదిలించుకోవడం? తనా ఆడది. అతనా మగవాడు. దౌర్జన్యం చేసినా చెయ్యవచ్చు! కాదనే ధైర్యం తనలో ఏముంది? గట్టిగా తనను బంధిస్తే తను ఏం చేస్తుంది? ఏం చెయ్యగలదు?అయినా ఇలా నా వెంట పడడానికి నా దగ్గిర ఏ మున్నదని? ఏమో! అతనికి కావలసినది ఏమిటో? ఎంత తర్కించుకున్నా అతని ఉద్దేశం అర్థం కావడం లేదు. ఎలా ఇతని బాధ తీరేది?' అని అనుకొంటూ చుట్టూ చూచింది.

చుట్టూ ఏముంది?

ఏమీ లేదు. అన్నీ పంటచేలు. ఖాళీగా ఉన్నాయి. అక్కడక్కడ చింతచెట్లు, ముళ్లపొదలు. పిట్ట కూడా కనిపించడంలేదు. అంతా నిర్జనంగా, నిర్మానుష్యంగా ఉన్నది. మంచినీళ్ల చాయలుకూడా ఎక్కడా కనిపించడం లేదు. చాలా దూరంగా పూరి గుడిసెల పైకప్పులు కనిపిస్తున్నాయి.

బహుశా, అదొక ఊరు అయిఉండవచ్చు.

'అవును! తప్పక అదొక ఊరే. త్వరగా పోవాలి. తన తొందర తనదేకాని నడిచే ఓపిక కాళ్లకు ఉండవద్దూ? ఏమిటో మనస్సు మూగబోతున్నది ఈ వాతావరణ స్థితి గతులకు. అబ్బ! ఎంత ప్రశాంతత! చల్లని గాలి మెల్లి మెల్లిగా సోకుతున్నది. అబ్బ! ఎంత పులకరింత! ఎంత తీయని బాధ!'

ఇలా మధుర భావనలో ఊగిసలాడుతున్న ఆమెకు అతని బూట్ల శబ్దం వినిపించింది. ఊహాజగత్తు వదిలి మామూలు జగతిలోనికి వచ్చింది. క్షణం మైమరిచి, వెంటనే మామూలు మనిషి అయింది.



అతను దగ్గిరగా వచ్చాడు. అతన్ని చూడగానే మరిచి పోయిన కోపం తిరిగి ఆమెలో ప్రవేశించింది. బెట్టుగా నిల్చున్నది. 'అతన్ని ఎలా అవమానపరచాలి? ఎలా అతనికి బుద్ధి చెప్పాలి?' అని అనుకోసాగింది.

అతను మరీ దగ్గిర అయ్యాడు. అతను కూడా ఆమె అలా నిలబడి తనకేసి చూడడం చూచి కొంచెం కలవరపడ్డాడు. ముఖంలో ఆ ఛాయలు కనిపించి వెంటనే మాయమయ్యాయి. అయినా ఏమీ మాట్లాడకుండా తల వంచుకొని నడుస్తూ ఆమె దగ్గిరగా వచ్చాడు.

అతను అంత దగ్గిరగా రావడంతో ఆమెకు భయం వేసింది. కొంచెం కంగారుపడింది. సర్దుకొని నిలబడింది. 'ధైర్యంతో అతన్ని ఎదుర్కోవాలి' అని అనుకొన్నది. 'మరీ ఉపేక్షించితే పైబడవచ్చు' అని అనుకొని వస్తున్న అతన్ని ఉద్దేశించి, "ఏయ్! మిస్టర్!" అని అందామె.

"ఏం?" అని ఆమెను చూచి నడక ఆపు చేశాడు అతను.

"మీకు సిగ్గులేదా?" ఇదీ ఆమె ప్రశ్న.

చాలా ఘాటైన ప్రశ్న.

ఎవర్ని అయినా పట్టుకొని, "మీకు సిగ్గులేదా?" అంటే అతను ఎంత బాధ పడతాడు! ఎంత కోపగించుకొంటాడు! ఎంత అవమానంగా భావిస్తాడు! తిరిగి అలా అడిగిన వారికి ఎంత ఘాటైన జవాబిస్తాడు! అత నేమి చెబుతాడో చూద్దాం.

ఆ ప్రశ్న విని అతను చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు. తల ఊపాడు ఉన్నదని. కాని, లేదు అన్నట్లుగా ఆమె భావించింది.

ఆ నవ్వు తనను సిగ్గుపరిచినట్లు, ఆ తల ఊపడం తనను అవమానించినట్లు ఆమె భావించింది. కోపం అవధులు దాటి పోయింది. వెళ్ళి అతని చెంపలు మారు మోగేటట్లు వాయించాలని అనిపించింది ఆమెకు. తక్షణం రెండడుగులు ముందుకువేసి వెంటనే ఆగింది. కోపాన్ని దిగమింగుకొన్నది. అతనివంక చూచింది. అతను చిరునవ్వుతో కనిపించాడు. ఓర్పు కాస్తా ఆ నవ్వును చూచి చాలా దూరం పోయింది ఆమెనుంచి.

"మీకు ఎవరూ దొరకలా వెంటపడడానికి?" అని కోపంతో అడిగింది ఆమె అతన్ని.

"లేదు!" అని తల ఊపాడు.

"మీ కేమీ పని లేదా?"

"లేదు!" అని తల ఊపాడు.

"ఇలా పరాయివాళ్ళ వెంటపడడం మీకు అలవాటా?"

"లేదు!" అని కళ్ళతో చెప్పాడు.

ఆ కళ్ళు తిప్పడం చూడగానే ఆమెలో ఓర్పు నశించింది. అయినా ఏం చేస్తుంది, పాపం! ఆడది! అబల! అంతా దిగమింగి ఏమీ అనలేక సిగ్గుతో తల వంచుకొన్నది. తన బాగు తీసుకొని వెంటనే నడక సాగించింది. ఆమెకు భయంభయంగా ఉన్నది అతను తనను ఏ క్షణంలో, ఏం చేస్తాడో? అని. ఆమెకు ఆలోచనలు జాస్తీ అయినవి.

'అసలు ఎవర్ని అయినా పిలుద్దామంటే జన సంచారం లేదు. ఏం చెయ్యను? ఏ నిమిషంలో ఏం చేస్తాడో, ఏం తెలుసు? క్షణం క్షణం గండం లాగున్నది. అతను అన్నిటికి తల ఊపడం తప్ప మాట్లాడ్డం లేదేమిటి? మాటలు రావా? అలా మౌనంగా ఉంటే తనపై జాలి పడతాననుకున్నాడు కాబోలు! ఆ

మనసు మంచిది కావచ్చు కాని మనసు తెలుసుకొనడానికి మార్గం ఏముంది? మనిషి మాటలు, చేతలు, పరిస్థితులు ఒకవిధంగా ఉన్నప్పుడు ఆ మనిషి మనసును వేరొక విధంగా ఊహించుకొనడం సాధ్యం కాదు. కనకనే మంచి చేయడంమాత్రమే కాదు, మంచి చేస్తున్నట్లు కనిపించడంకూడా అవసరం.

---

ఎత్తులు మన దగ్గిర పని చెయ్యవు!

'ఇలా నా వెంటపడి ఏం చేద్దామని ఇతని ఉద్దేశ్యం? ఉలకడు, పలకడు. మౌనంగా ఉంటాడు. ఎందుకబ్బా? ఓహో, అర్థమైంది! దారిని వస్తూ ఎవరైనా వింటే నాది తప్పని అనిపించడానికి కాబోలు ఈ ఎత్తు. ఎంత తెలివి! ఏమి జాగ్రత్త! ఆహా! అతని ముందుచూపుకి జోహారు. ఇన్ని తెలివితేటలు ఇంకా దేనిలోనైనా చూపెడితే ఎంత పేరు అతనికి! ఎంత ప్రఖ్యాతి లభిస్తుంది! ఇంతకీ అతనికి మాటలు రావా? ఎందుకు నా వెంట పడడం?' ఇలా ఆలోచిస్తూ గబగబా ముందుకు అడుగు వేస్తున్నది ఆమె.

ఆమె నడక, ఆమె కంగారు చూస్తున్న అతనికి ఆమె మీద జాలి కలిగింది. తనను అనుమానించినట్లు భావించాడు. 'అయినా ఎందాక వస్తుందో వ్యవహారం చూద్దాం!' అని అనుకొని తనూ గబగబా ఆమె వెనక నడవసాగాడు.

## 3

నడుస్తూ నడుస్తూ ఉండగా ఒక ఊరు తగిలింది. ఆ ఊరిలోకి అడుగుపెట్టింది.

ఆ గ్రామం ఒక పల్లెటూరు. అందరూ రైతుల్లా గున్నారు. ఎవర్ని చూచినా పంచెకట్టు, ఖద్దరుచొక్కా, నెత్తిన తలపాగా కనిపిస్తున్నాయి. చేతిలో కఱ్ఱ. కాళ్ళకు కిర్రు చెప్పులు. దారిని పోయే ఒక పెద్దమనిషిని పిలిచి ఆ ఊరిపేరు వగైరా అడిగింది ఆమె. అతను ఏదో చెప్పాడు.

ఆ గ్రామం పేరు సిరిపురం అని మటుకు తెలిసింది ఆమెకు. అతన్ని కాఫీహోటలును గురించి కూడా అడిగింది.

"అదిగో, చూడండి! ఆ రోడ్డువారన కనిపిస్తున్నదె పాక, అదే కాఫీహోటలు" అని చేతితో చూపించి మరీ చెప్పాడు. చెప్పి తన దారిని తాను పోయాడు. తొందర తొందరగా అచటికి చేరుకున్నది ఆమె.

అది ఒక చిన్న పాక. బయట ఒక పొడుగుపాటి బల్ల వేసి ఉంది. దానిమీద చతికిలపడి ఆమె కాఫీకి ఆర్డరిచ్చింది. ఇంతలో అతను కూడా వచ్చి ఆమెకు కొంచెం దూరంలో ఆ బల్లమీదే కూర్చున్నాడు.

అక్కడ ఇంకో బల్ల లేదులెండి. అతను కూడా కాఫీకి ఆర్డరిచ్చాడు.

---

బూదూరి

వెంకట ప్రసాదరావు

---

అతన్ని చూచి కూడా ఆమె చూడనట్లే నటించి కాఫీ రాగా తాగింది. డబ్బులు చెల్లించింది. పది నిమిషాలు విశ్రాంతి తీసుకొన్నది. హోటలతనితో తను పోవలసిన ఊరికి దారి ఎటో అడిగి తెలిసికొన్నది.

పాపం, ఆమెకు ఇంకా నడవాలంటె కష్టంగాఉన్నది. ఇప్పటికే రెండు మైళ్ళపైగా నడిచింది. ఇంకా ఎంత దూరం పోవాలో ఆమె? ఎంత శ్రమ!

భారంగా లేచింది ఆమె. బాగు తీసుకొని సన్నటి మట్టి రోడ్డుమీద నడక సాగించింది. అతను కూడా కాఫీ రాగా తాగి డబ్బులు చెల్లించి ఆమె పోయిన దారినే నడవడం ప్రారంభించాడు. ఇద్దరూ అలా నడుస్తూ పోతూ ఉన్నారు.

కొంతదూరం పోయింది ఆమె. తన వెనక తప్పట్లు కొట్టినట్లు శబ్దం వినిపించింది ఆమెకు. వెనుతిరిగి చూచింది. చిరునవ్వుతో అతను కనిపించాడు. అతన్ని చూడగానే ఆమెలో కోపం పగవట్టిన తాచులా బుస కొట్టసాగింది.

అయినా 'ఎందుకు?' అన్నట్లు అతనికేసి చూచింది.

'ఇలా రండి!' అన్న భావన స్ఫురించేలా చేతి సంజ్ఞ చేశాడు.

ఆ సంజ్ఞ ఆమెకు అర్థమైంది. ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఒడలు నిలబడటం లేదు. భయం భయంకర పిశాచిలా ఆమెను అదిమిపెట్ట సాగింది.

చుట్టూ చూచింది. పిట్ట కూడా కనిపించడం లేదు. గ్రామం దాటి చాలా దూరం వచ్చింది. తనకు కొంచెం దూరంలో డొంక కనిపించింది. తిరిగి అతన్ని చూచింది. అలాగే చెయ్యి ఊపుతున్నాడు ఇలా రండని. పూర్తిగా అర్థమైంది ఆమెకు అత నెందుకు రమ్మంటున్నది.

ఎలాగ? పారిపోదామంటే దారి తెలియదు. అసలే కొత్త. దానికి తోడు ఈ బాగు. తనా అబల! ఏం చెయ్యాలి? పోనీ, గట్టిగా అరుద్దామంటే ఎక్కడా మనిషి జాడ లేదు. గట్టిగా ఏడవాలనిపించింది. తనను తావే తిట్టుకొన్నది.

"ఒంటరిగా పోతాను, నాన్నా! నాకేం భయం? ఐదు మైళ్ళటగా ఆ ఊరు? మధ్య మధ్య గ్రామాలు తగులుతూంటాయట. పచ్చని పొలాలగుండా చక్కగా నడిచిపోతాను" అని తలిదండ్రుల దగ్గిర డంబాలు పలికింది తను. తోడు వస్తున్న నాన్నను తానే వద్దని పినపాకలో తిరిగి పంపివేసింది. అప్పటికీ నాన్న "జాగ్రత్తమ్మా! ఆడ పిల్లవు! ఒంటరి ప్రయాణం" అని అన్నాడు కూడా.

'నాన్న తోడు వస్తే బాగుండేది. ఇలాంటి వాళ్ళ కంటికి అంత తేలిగ్గా కనిపించి ఉండేదాన్ని కాదు. ఎవరనుకున్నాడో? ఒంటరిగా పోతున్నది కదా! వెంటపడి ఓ చూపు చూడవచ్చు అని అనుకున్నాడు కాబోలు! అనుకోవడమేమిటి, అక్షరాలా జరిపిస్తూంటే? ఎంత తెగించాడు! ఎంత నంగనాచిలా పలకకుండా, తిట్లు తిట్టినా తనను కాదన్నట్లు ఒళ్ళు దులుపుకొని, సిగ్గు లేకుండా మరీ వెంటపడ్డాడు!

'ఏం చెయ్యాలి? ఎవరికైనా ఈ సంగతి చెబుదామంటే, కారణం లేకుండా ఎలా చెప్పడం? చెప్పినా నమ్మరుగా? నాదే తప్పంటారు. కారణం, తాను అబల కాబట్టి.' ఇలా ఆలోచనలో కొట్టుకుపోతున్న ఆమెకు

తిరిగి చప్పట్లు వినిపించాయి. అటుకేసి చూచింది. అతని చేసంజ్ఞ కనిపించింది.

'ఛీ! ఛీ! అతను పిలుస్తూంటే నే వెళ్లాలా? అతని పలుకాంక్షకు నేను, నేనుగా ముందుకు అడుగు వెయ్యాలా? నేనేమైన జారిణినా, ఇలా ముందు కాలుజార డానికి? అయినా ఎంత తెగింపు, చొరవ లేకపోతే అలా చేసంజ్ఞ చేస్తాడు?' ఇలా ఆలోచిస్తూ అటు చూచింది ఆమె.

ఆశ్చర్యం! అతను ఆమెకేసి వస్తున్నాడు. అది చూచి మరీ భయపడింది.

'ఇక లాభంలేదు. ఇలా ఇక్కడే ఆలోచిస్తూ కాల క్షేపం చేసే బదులు అతని దగ్గిరికే వెళ్లి అసలు విషయం కనుక్కుంటాను' అని అనుకొని ఆమె అతని దగ్గిరికి నడక సాగించింది. ఆమె నడిచి రావడం చూచి అతను ముందుకు వస్తున్నవాడల్లా ఆగి, వెనక్కు నడిచి ఒక చోట ఆగాడు.

నడుస్తూఉన్న ఆమెలో విచక్షణాజ్ఞానం నశించింది.

'అంతగా అతను తెగిస్తే, ధైర్యంగా ఎదుర్కొం టాను. లేకపోతే ఎలాగో తప్పించుకొని ఊరిలోకి పారి పోతాను' అని అనుకొన్నది. అలా నిర్ణయించుకొన్నది కూడా. అలా నిర్ణయా నిర్ణయాలతోనే అతని దగ్గిరికి వచ్చి చేరుకొన్నది.

"ఏం?" అన్నట్లు అతన్ని మింగేలా చూచింది.

"ఎందుకు పిలిచారు?" అని ప్రశ్నించింది ఆమె.

ఆ అడగడం శాంతంగా లేదు. తిరస్కారభావం, కోపం రెండూ సమ్మిళితమై ఇలా మాటల రూపంలో వెలువరించబడ్డాయి. ఆ ప్రశ్నకు అతను కొంచెం కంగారు పడడం మటుకు మామూలైంది. కొద్దిగా జాగ్రత్త పడ్డాడు. అయినా ఏం మాట్లాడలేదు. తిరిగి బదులు పలకకుండా రెండు బాటలు చీలిన స్థలం చూపించాడు.

అతను చూపిన స్థలం, ఆ రెండు బాటలు చూచింది. ఏం అర్థం కాలేదు ఆమెకు.

"ఏమిటి?" అన్నట్లు తిరిగి అతన్ని తీక్షణంగా చూచింది.

రెండు బాటలలో ఒక బాట చూపిస్తూ అటు నడవమని చేసంజ్ఞ చేసి చెప్పాడు. అర్థమైంది ఆమెకు.

'ఏమిటి అతని ఉద్దేశ్యం? ఈ బాటలో పోతే ఏఊరు వస్తుంది? మరి ఇందాకా నేను నడిచింది దారి కాదా? ఏమి టీ గందరగోళం? ఎలా ఇతను చూపుతున్న బాటనే పోవడం? అయినా నేను ఏ ఊరు వెళ్లుతున్నానో ఇతనికి ఎలా తెలుసు? దివ్యనేత్రం ఉన్నదా? ఈ పాడు ముఖానికి అదొక్కటే తక్కువ.

'ఊహించాడా? ఏమో! మాట రాదా? పలికితే ముత్యాలు రాలతాయా? మాట్లాడకుండా చేసంజ్ఞలు చేస్తున్నాడు. మూగవాడా? ఎవడైతే మటుకు ఏం? ఏమిటి, ఈయన వైఖరి? ఎలా ఈ సమస్య పరిష్కారం అయ్యేది?' అలా అనుకొని అతనివంక చూచింది. అతను చిరునవ్వు నవ్వుతూ రెండు బాటలలో ఒక బాటకేసి సంజ్ఞ చేస్తున్నాడు అటు నడిచి వెళ్లమని.

'నన్ను వెళ్లమంటాడే కాని తను కదలడేమిటి? కొంపతీసి ఇది ఏ డొంకలోకో దారి తియ్యదు కదా? అమ్మయ్యో! ఎంత కుట్ర! ఎంత పన్నాగం! ఎలా బయటపడాలి ఈ పద్మవ్యూహంలో నుంచి?

'అకస్మాత్తుగా ఆ చెంప ఈ చెంప వాయిస్తే! అమ్మో! ఇంకేమైనా ఉందా? ఇంత చేసినవాడు అంత ఓపిగ్గా సహించి నన్ను వదలుతాడా, మరి? కాని, ఏం చెయ్యాలి?' అని ఆలోచిస్తూ చుట్టూ చూచింది.

ఎవరో పేరుతెలియని ముసలాయన వాళ్ల దగ్గిరికే నడిచి వస్తున్నాడు. అతన్ని చూచింది ఆమె. ఆమె మనస్సు కొంచెం కుదుటపడ్డది. 'ఈ చిదంబర రహస్యాన్ని అతనినే అడిగితే విప్పి చెబుతాడు' అని అనుకొని అతని రాక కోసం ఎదురుచూడసాగింది.

పది నిమిషాలు దొర్లిపోయాయి. ఇద్దరూ మౌనంగా అలా నిలబడి ఉన్నారు. ఇంతలో ఆ ముదుసలి వాళ్ల దగ్గిరికి వచ్చాడు. గబగబా అతని ముందుకు వెళ్లి, ఆ రెండు బాటలను అతనికి చూపించి, ఆ రెండు ఎటుగా పోతాయో అని అడిగింది ఆమె.

ఆమె ప్రశ్న విని ఆ ముదుసలి ఆమెను, అతన్ని ఎగా దిగా పరీక్షగా చూచి చిరునవ్వు నవ్వుకున్నాడు. ఆ రెండు బాటలలో రెండవ బాట చూపాడు. ఇందాక అతను చూపిన బాట అదే లెండి. అలా చూపి తన దారిని తాను పోయాడు ఆ ముదుసలి.

ఆమె ఆశ్చర్యపోయింది.

'అయితే నేను ఎచ్చటకు వెళ్లేది అతనికి తెలుసు నన్నమాట. దారి కూడా బాగా తెలును కాబోలు! అంటే, బహుశా ఈ చుట్టుపక్కల ప్రాంతం వాడై ఉండి ఉంటాడు' అని అనుకొన్నది ఆమె. వెళ్లిపోతున్న ముదు సలిని మళ్లీ పిలిచి, "ఎక్కడికి పోతున్నారు?" అని అడిగింది ఆమె.

"చేనుకి పోతున్నానమ్మా!" అని జవాబు చెప్పాడు ముదుసలి. తిరిగి ఆమెను ఇలా అడిగాడు:

"ఇంకా ఏమైనా సందేహా లున్నాయా, అమ్మా?"

"అవునండీ!" ఆమె చెప్పింది.

ఇందాకా తను నడిచిన బాట అతనికి చూపించి, "ఆ దారి ఎక్కడికి వెళ్లుతుందండీ?" అని అడిగింది ఆమె.

"పరాపరి డొంకలోకి పోతుందమ్మా! మరి, నే పోతాను, తల్లీ! ఏమంటావు?"

"వెళ్లి రండి!" అని చెప్పింది ఆమె.

ఆమె తన పొరపాటు తానే సరిదిద్దుకొన్నది. తన అజ్ఞానానికి తనను తానే నిందించుకొన్నది; తనను తానే తిట్టుకొన్నది.

'ఊరికే అతన్ని అనుమానించాను. ఎడతెగని నీచాభిప్రాయాలకు చోటిచ్చాను. పాపం! మంచివాడు లాగున్నాడు' అని మనస్సులో అనుకొన్నది ఆమె.

అదే చాలు అతనికి!

ఇదంతా ఒక్క క్షణం. అంతలోనే అనుమాన చాయలు ఆమెను అలుముకున్నాయి.

'చెడు స్వీకరించినట్లు మంచిని స్వీకరించలేరుగా!' అనుకొన్నది.

'ఏమో! ఎవరు చెప్పగలరు? ఆ ముసలాయన సమ యానికి రాకపోతే నా గతి ఏం కాను? దేవుడులా వచ్చి కాపాడాడు. లేకపోతే ఈయనగారి అసలు వేషం బయట పడేది. ఇంకా ఆలస్యం చేస్తే అతనేమైనా చెయ్య గండు' అని జడిసి కింద ఉన్న బాగు తీసుకొని వేగంగా ఆ బాటనే పడి నడిచి పోసాగింది.

పాపం! కనీసం థాంక్సు కూడా చెప్పలేదేమిటి ఆమె అతనికి?

అతను కూడా ఆమె చేష్టలు గమనిస్తూ ఆ వెనకనే బయలుదేరి ఆ బాటనే నడవసాగాడు.

కొంచెం దూరం పోయాక వాగు తగిలింది. వాగులో నీళ్లు పారుతున్నాయి. వాగును చూడగానే ఆమెకు కొద్దిగా భయం కలిగింది.

అసలే ఆడది! అందులో ఒంటరి ప్రయాణం. అయినా ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని వాగులోకి అడుగు పెట్టింది. నీళ్లు మోకాలి లోతువరకు వచ్చాయి. చీర కుచ్చెళ్లు పైకి తీసుకున్నది ఎడం చేత్తో. కుడి చేత్తో బాగు పట్టుకొని జాగ్రత్తగా నీటిని చీల్చు కుంటూ నెమ్మది నెమ్మదిగా అడుగులు వెయ్యసాగింది.

వాగు దాటుతున్నంతసేపు ఆమె ఎంతమంది దేవుళ్లకు మొక్కుకొన్నదో, ఎంత మందిని కొలిచిందో లెక్క లేదు, ప్రాణాపాయం లేకుండా చేయమని. ఆమె భయం ఆమెది. నెమ్మదిగా వాగు దాటింది. ఒడ్డుకు చేరుకొన్నది ఎలాగైతే.

ఒడ్డున 'అమ్మయ్య' అని అనుకొని పది నిమిషాలు విశ్రాంతి తీసుకొన్నది కూర్చొని. ఇంతలో ఆమె కాళ్ల తడి ఆరింది. ఒడ్డున విల్చుని కాసిని మంచినీళ్లు తాగింది దాహం వేస్తే. 'అమ్మయ్య' అని తిరిగి అను కొని అటు కేసి చూచింది. అతను అవలి ఒడ్డున బూట్లు విప్పుకొంటున్నాడు. అతన్ని చూచాక ఇక అక్కడ ఆగ బుద్ధికాక బాగు తీసుకొని నడక సాగించింది.

> ఒక గ్రంథం ఆధారం చేసుకొని చలనచిత్రం నిర్మించినప్పుడు దానిని ఆధారం చేసుకొని ఆ గ్రంథం మంచి చెడ్డలు నిర్ణయించవద్దు.
>
> — జె. డబ్లియు. ఈగన్

## 4

మెల్లిగా నడుస్తున్నది ఆమె. నుదుటి చెమట జేబురుమాలుతో తుడుచుకొంటున్నది. ఆమెలో ఆయాసం, నీరసం రెండూ మిళితమై తొంగి చూస్తున్నాయి.

'ఛీ! వెధవ ఉద్యోగం? ఇప్పటికి మూడుమైళ్లు పైగా నడిచాను. ఇంకా దారితెన్నూలేదు. ఇంకా చాలా దూరం నడవాలి కాబోలు! ఈ ఊళ్లను చూస్తూంటే అన్నీ పల్లెటూళ్లలా కనిపిస్తున్నాయి. నేను పని చెయ్య బోయే ఊరు కూడా చిన్న పల్లెటూరు అయిఉంటుంది. బహుశా స్కూలు చిన్నదై ఉంటుంది. అయినా ఏం చేస్తాం? ఉద్యోగ ధర్మం!

'పాడు బ్రతుకు బ్రతక్కపోతే ఏం? నావయస్సు కల వాళ్లంతా ఉద్యోగాలు చేస్తున్నారా? నా స్నేహితులలో ఎంతమంది ఇంకా చదువుకోవడంలేదు? ఎంతమందికి పెళ్లిళ్లు అయి శుభ్రంగా కాపరాలు చేసుకోవడంలేదు? కొంతమందికి పాపలు కూడా! నా బ్రతుకు మటుకు ఇలా తయారైంది. అంతా నా కర్మ. కర్మ కాదు, పూర్వం చేసుకున్న పుణ్యఫలం ఇది.

(తరువాయి 37 వ పేజీలో)

# తెల్లబోయిన పడతి

( 35 వ పేజీ తరువాయి)

'వచ్చిన ఉద్యోగాన్ని తిట్టుకోవడం చాలాతప్పు! అది రానంతకాలం ఎంతవేదన పడ్డాను! ఎన్ని కష్టాలుపడ్డాను! ఎన్ని శాపనార్థాలు, తిట్లు తగిలాయి? ఎంతమందికి చులకన అయ్యాను! ఎంతమంది దేవుళ్లకు మొక్కుకున్నాను! అహోరాత్రాలు ఈ అర్జీల కోసం పడిగాపులు కాయలేదా? అయితే మటుకు ఇంత శ్రమపడాలా ఉద్యోగానికి? అవును, పడాలి! ఉద్యోగం చెయ్యాలి, జీవనం గడపాలి అని అనుకున్నప్పుడు ఎంత శ్రమ అయినా పడాలి. ఆ ఉద్యోగం ఎక్కడ లభించినా, ఎక్కడికి వెళ్లి పని చెయమన్నా అన్నీ దిగమింగుకొని చిరునవ్వుతో వాటిని స్వీకరించాలి. చిరునవ్వు అంటే గుర్తుకు వచ్చింది. నావెనకాల వస్తున్న అతను ఏం చేస్తున్నాడు? ఇంకా నా వెంట పడడంలేదు కదా! అయినా ఏమిటి ఈ మనిషి తత్త్వం?' అని అనుకుంటూ వెనుతిరిగి చూచింది. నడుస్తూ వస్తున్న అతను కనిపించాడు.

'ఛ! నాకెందుకు అతని గొడవ?' అని అనుకొని నడక సాగించింది. కాని అతన్ని గురించిన ఆలోచనలు ఆమెను వదిలిపోలేదు.

'చాలా దూరంనుంచి ఇలా నన్ను వెంటాడుతున్నాడు. బస్సులోను అంతే! అదే పనిగా నావంక చూడడం! సిగ్గు లేదు కాబోలు. చెల్లాయిలులేరు కాబోలు! ఛా! అతన్ని గురించి ఏమిటి నా ఆలోచనలు? అవును. అందరూ ఉన్నారని చెప్పాడు కదూ! చెప్పాడా? చెప్పలేదు, తల ఊపాడు. అంతే! మరిచా ఆ విషయం.

'పినపాక స్టాండులో నాతోపాటే దిగాడు. నేను నాన్నను తిరిగి బస్సులో పంపివేసి బాగు తీసుకొని బయలుదేరేదాకా అలా అక్కడగల హోటలులో ఉండి నాకేసి చూస్తూ, నన్నే పరీక్షిస్తూ ఉండిపోయాడు. నెమ్మదిగా నా వెంట పడ్డాడు.

'ఊరికే నా అనుమానం తప్పు అతను మంచివాడేమో! ఏం పలకడు. ఉలకడు. చదువుకున్నవాడు లాగున్నాడు. ఏమో! చదువుకున్నాడో, లేదో? ఒకవేళ అతను కనిపిస్తున్న ఊరివాడేమో! ఏమో! అయినా అడిగి తెలుసుకొంటే ఏమిటి తప్పు?' అని అనుకొని ఆగింది ఆమె.

అతను నెమ్మదిగా నడుస్తూ వస్తున్నట్లు కనిపించింది ఆమెకు. అతను దగ్గరగా వచ్చే అంతవరకు ఆగింది. ఇదివరకంత కోపంలేదు ఆమెలో. కొంచెం నిదానంగా ఉంది. అతన్ని ఉద్దేశించి, "మీరు ఏ ఊరు వెడతారు?" అని అడిగింది. దానికి అతను ఏమీ బదులు చెప్పకుండా చిరునవ్వు నవ్వుతూ దారి, చేతితో అలా అలా చూపించాడు.

అతను మాట్లాడకుండా నవ్వుతూ చేతి సంజ్ఞలు చెయ్యడం ఆమెకు చిరాకెత్తించింది. మరిచి పోయిన కోపం తిరిగి ఆమెలో ప్రవేశించింది. ఆమె ముఖకవళికలు కొద్దిగా మారాయి.

"కనిపించే ఊరు వెడతారా?"

"లేదు!" అన్నట్లు తల ఊపాడు.

కోపం వచ్చింది ఆమెకు అతను మాట చెప్పకుండా తల ఊపినందుకు. అది కాస్తా తారస్థాయి అందుకుంది.

"ఇలా నా వెంట పడతారా?"

ఇది ఘాటైన ప్రశ్న. దీటైన ప్రశ్న.

'లేదు' అన్నట్లు తల ఊపాడు.

"ఏమిటి మరి మీ ఉద్దేశ్యం?"

'ఏమీలేదు!' అన్న భావం స్ఫురించేలా ముఖ భంగిమమార్చాడు ఆమెవంక చూస్తూ. పెదవులపై చిరునవ్వు మటుకు దూరం కాలేదు.

ఆమెకు అతని తీరు, ఆ చిరునవ్వు చూచేసరికి చిరాకెత్తింది. దీనితోపాటు విసుగు కలిగింది. ఎన్ని అడిగినా లాభం లేదని తలిచి బాగు తీసుకొని నడక సాగించింది. ఆవెనక అతను నడవడం మామూలు.

గబగబా నాలుగడుగులు వేసి తిరిగి నిదానంగా నడవడం ప్రారంభించింది. ఇద్దరూ అలా నడుస్తూ కనిపించే ఊరు సమీపించారు. ఊరిలో ప్రవేశించారు. ఆ ఊరి పేరు వగైరాలు ఆమె ఒక పెద్దమనిషిని అడిగి తెలుసుకొన్నది.

ఆ గ్రామం పేరు పున్నెపూరు. అచట అంతా రైతులే వ్యవసాయం వాళ్ల వృత్తి. అందరూ నాగలి పట్టేవారే. అచ్చటచ్చట డాబాలు, మిద్దెలు కనిపిస్తున్నాయి.

వీధివెంట అలా ఇద్దరూ నడుస్తూ పోతూంటే ఆ ఊరిలోని ప్రజలు వింత చూచినట్లు వాళ్లను చూడ సాగారు. ఒకళ్లిద్దరు ఏవేవో అన్నారు కూడా. అమ్మ లక్కలు బుగ్గలు నొక్కుకున్నారు. ఒక ముసలాయన గట్టిగా నలుగురికి వినిపించేలా ఇలా అన్నాడు:

"ఎంత చక్కని జంట! చిలకా గోరింకల్లా ఉన్నారు. ఈడూ జోడంటే అలా ఉండాలి. ఎందుకూ, ఉంటారు కొన్నిజంటలు పరమాసహ్యంగా!"

ఈ మాటలు సన్నగా ఆమె చెవులలో పడ్డాయి. వెంటనే తల తిప్పి మాటలు వినిపించిన దిక్కుకేసి చూచింది. ఎవరో ముసలాయన కనిపించాడు. ఆమెకు ఒళ్లు మండింది. ఆమెలో రక్తం పొంగి పొరలింది. అయినా ఏంచేస్తుంది? అంతా దిగమింగి తల మరీ వంచి వేగంగా నడక సాగించింది. ఊరి చివరికి చేరుకొన్నది.

ఆగింది ఆమె, తను పోయే దారి ఎటో తెలియక. అక్కడ మూడుబాటలు కనిపిస్తున్నాయి. మరి ఏ బాటలో వెళ్లాలో తెలియదు ఆమెకు.

అవును, పాపం! ఆమె కేమి తెలుసు?

అటుగా పోతున్న ఒక పెద్దమనిషిని పిలిచి తన అనుమానం తీర్చుకొన్నది ఆమె. మధ్యబాటగుండా ప్రయాణం సాగించింది. నీరసంగా నడుస్తూ పోతున్నది.

కొంతదూరం పోయాక ముళ్లచెట్ల అడివి కనిపించింది. అడివి కాదు లెండి! అక్కడ ఫర్లాంగు దూరం వరకు ముళ్లచెట్లు గుబురు గుబురుగా ఉన్నాయి. నాలుగు వైపుల ఆచెట్లు అలుముకొని ఉన్నాయి. చుట్టూ నాలుగు వైపుల అడివిలా దట్టంగా ఉన్నది. ఆదట్టమైన ముళ్ల చెట్ల మధ్యనుంచి కాలిబాట ఉన్నది.

'ఆ బాటలో నడవాలి' అనుకునేసరికి ఆమెకు భయం కలిగింది. గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఒళ్లు జలదరించింది. అయినా ఏంచేస్తుంది? మనోధైర్యాన్ని కూడగట్టుకొని నెమ్మదిగా ఆ బాటలో నడవసాగింది. ఆ ముళ్లచెట్ల కొమ్మలకు ఒళ్లు తగలకుండా జాగ్రత్తగా పరిశీలిస్తూ ముందుచూపు చూచుకుంటూ నెమ్మదిగా నడవసాగింది. క్షణం గడిచాక వడివడిగా



రైతు పాట్లు

చిత్రం — కె. బ్రహ్మానందరావు (మద్రాసు-17)

అడుగు వెయ్యసాగింది.

ఎంత భయం!

ఆమె ఆగింది. కొంగు లాక్కుంది. కానీ, రావడం లేదు. చుట్టూ చూచింది. దట్టంగా పెరిగిన ముళ్ల చెట్లు కనిపించాయి. పగలయినా అక్కడ చీకటిగా ఉంది. అంత దట్టంగా నాలుగు వైపుల వ్యాపించి ఉన్నాయి ముళ్లచెట్లు.

మళ్లీ లాక్కుంది. కానీ, రావడంలేదు. ఎవరో మనిషి లాగుతున్నట్లు అనిపించింది ఆమెకు.

మళ్లీ లాక్కుంది. ఈసారి ఎవరో గట్టిగా లాగినట్లు ఆమె వెనక్కు పడబోయింది. కాని, నిలదొక్కుకున్నది.

మళ్లీ లాక్కుంది. కానీ, రావడం లేదు. ఎలా? ఈ విచిత్ర పరిణామం ఆమెను భయవిహ్వలురాలిని చేసింది. ఆమెకు భయం కలిగింది. అది క్రమేపి జాస్తి కాసాగింది.

కారణం ఏమంటారు?

ఆమె ఆ ముళ్లచెట్ల అడివిలోకి సగం దూరం వరకు వచ్చింది. ఆమె ఆ అడివి మధ్యన భీత హరిణంలా ఉన్నది. అది ప్రస్తుత స్థితి.

ఏమి టీ వైపరీత్యం?

ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుంది. ఊం అంటే కన్నీరు ఆమె కనుపాపలలోనుంచి సెలయేరులా ప్రవహించేటట్లుఉన్నది. ఉండడమేమిటి? కనుపాపలదాకా కన్నీరు వచ్చింది కూడా.

కద్ది ధైర్యంతో తిరిగి లాక్కుంది. కానీ, రావడం లేదు. ఎలా?

ఆమెకు అనుమానం కలిగింది. అతనుకాని లాగడం లేదు కదా కొంపదీసి! ఇంతవరకు ఆమె అతన్ని మరిచింది. ఏదో ఆలోచనలతో తల వంచి గబగబా నడుస్తూ ఇంతవరకు వచ్చింది. ఈ సంఘటనతో తిరిగి అతను స్మృతిలోకి వచ్చాడు. అతన్ని తలుచుకొనేసరికి ఆమెకు మరీ భయం కలిగింది.

అతనంటే అసహ్యం కలిగింది ఆమెకు. గబగబా నమిలి మింగేయాలన్నంత కోపం వచ్చింది. ఆ చెంప ఈ చెంప కందిపోయేటట్లు వాయించా లనిపించింది. అయినా ఇప్పు డేమి చెయ్యగలడు? ఆలోచనలు ఆమెను ఆక్రమించాయి.

'సిగ్గులేదు కాబోలు! ఇందుకే కాబోలు ఇంతవరకు ఏమీ చెయ్యకుండా నా వెంట పడి వస్తున్నాడు. చుట్టూ చూస్తే పగలే చీకటిగా ఉంది. గట్టిగా నన్ను పట్టుకొని ఏం చేసినా చెయ్యవచ్చు! చెయ్య వచ్చు అన్న మాటేమిటి ఒక పక్క చేస్తూంటే!

అమూల్యమైన
మంచి సీటు



హెక్టార్

విశిష్టమైన రకము...
సరసమైన ధర

హెక్టార్‌కు విశిష్టమైన సీటుకు ఉండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. అయినా సరసమైన ధరే నిర్ణయించబడింది. అతి నున్నితమైన చర్మంతో తయారుచేయబడి దిట్టంగా మెత్తగా ఉంటుంది. చూడండి సైకిల్ తొక్కటంలో అత్యధిక సౌఖ్యాన్నిచ్చేటట్టుగా సీటు డిజైను కావింపబడినది.
మీరు సైకిల్ కొంటే హెక్టార్ వాడండి. మీ సీటును మార్చినప్పుడు హెక్టార్ వాడండి.

హెక్టార
—దానికదేసాటిగల విశిష్టమైన సీటు

భారతదేశంలో తయారీ
ది రైట్ సాడిల్స్ ఆఫ్ ఇండియా, అంబత్తూరు, మద్రాసు-53
ప్రొప్రైటర్లు :
ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు-1.

చిన్న మొత్తాల సేకరణలో ఆదాచేయండి JWT-WS-378


# తెల్లబోయిన పడతి

అప్పుడే సాహసం చూపాడు కూడా! అదును చూచి పైట లాగాడు కదా! ఇప్పు డేమి చెయ్యాలి?

'సమయం, సందర్భం కలిసి రావాలని అన్నారు పెద్దలు. ఊరికే అనలేదు ఆ మాట. అది అక్షరాలా ఇప్పుడు నిజమైంది! అతనికి అన్నీ కలిసి వచ్చాయి. ఇప్పుడు నన్ను పట్టి ఏం చేసినా అతన్ని ఎవ్వరూ అడ్డగించే దిక్కు లేదు కదా! ఎలా?

'ఓయి భగవంతుడా! నీవే నాకు దిక్కు! నీవే నన్ను రక్షించాలి. నిన్ను శరణు వేడుతున్నాను. ఎలా రక్షిస్తావో, మరి? ఆ భారమంతా నీదే!' ఇలా అనుకుంటున్నంతలో తిరిగి ఎవరో లాగుతున్నట్లు భ్రాంతి కలిగింది ఆమెకు.

కంగారు పడ్డది.

'ఎలా? దారేమిటి నాకు?' ఈ ప్రశ్న పరంపరలలో ఆమెకు తన కర్తవ్యం, తన బాధ్యత, తన విధి గుర్తుకు వచ్చాయి.

'సరే, చూద్దాం. అంతగా ఏదైనా చేస్తే ఉండనే ఉంది ఆయుధం రక్కడం, కొరకడం, గింజుకోవడం. ఆత్మరక్షణార్థం ఎంతకైనా తెగిస్తాను!' అని అనుకొని ధైర్యాన్నికూడ దీసుకున్నది.

అయినా భయం ఆమెను విడిచిపెట్టి పోలేదు. భయం భయంగానే బాగు కింద పెట్టి తటాలున వెను తిరిగి చూచింది.

ఏమవుతుం దంటారు?

ఏముంది? ఏమీ లేదు! ఆమె అనుకొనే భయంకర నారీ కామపిశాచి అయిన అతను లేడు అక్కడ. మరి ఏముంది?

ఎవరూ లేరు! ఆమె కొంగు ఏదో ముళ్ల కొమ్మకు తగులుకొని ఉన్నది.

చాలా ఆశ్చర్యపోయింది ఆమె. సిగ్గుపడ్డది కూడా.

'తను ఆలోచించిన దేమిటి? జరుగుతున్న దేమిటి? తను చూస్తున్న దేమిటి?' తను అంత చెడుగా ఆలోచించినందుకు తన్ను తానే తిట్టుకొన్నది.

మెల్లిగా వెనక్కు నాలుగడుగులు వేసి జాగ్రత్తగా ఆ ముళ్లకొమ్మనుంచి పైట తీసుకొన్నది.

'అమ్మయ్య!' ఆమె మనస్సు కొద్దిగా తేలిక పడ్డది.

'వెధవ ఆలోచనలు! ఎంత భయాన్ని కలిగించాయి!' అని అనుకొన్నది ఆమె. 'అతను వెనక వస్తున్నాడా? లేదా?' అన్న సంశయం కలిగి వెనుతిరిగి చూచింది. తల వంచి గబగబా నడుస్తూ వస్తున్నట్లు అతను కనిపించాడు. 'అయినా మన కెందుకులే!' అనుకొని తిరిగి నడక సాగించింది.

ఆ అడివి దాటింది. అలా నడుస్తూనే ఉన్నది.

కొంత దూరం పోయాక తిరిగి వాగు కనిపించింది. ఇదివరలా భయపడలేదు ఆమె. అయినా భయంభయంగా అతి జాగ్రత్తగా వాగు దాటింది. ఒడ్డున కాస్సేపు విశ్రాంతి తీసుకొని తిరిగి నడవ సాగింది.

కొంత దూరం సాగాక ఒక ఊరు కనిపించింది. కొంచెం హుషారు ఆమెలో ప్రవేశించింది. అడుగులు వేగంగా పడ్డాయి. ఊరిలో పాదం పెట్టింది. నాలు

గడుగులు వేసి ఆగింది.

ఆ దారినే ఆమె కేసి వస్తూన్న ఒక పెద్దమనిషిని ఆపి ఆ ఊరిపేరు వగైరాలు అడిగి తెలుసుకొన్నది.

ఆ గ్రామం పేరు కుర్నవెల్లి. అంతా గ్రామీణులే. అందరూ రైతులే. వ్యవసాయం వాళ్ల వృత్తి.

ఆమెకు పాఠశాల విషయం కావాలి. అందుకని ఆ విషయం కూడా అతన్ని అడిగి తెలుసుకొన్నది.

"మొదటి వీధి వదిలి, రెండవ వీధిని పడి పోవాలి. ఆ వీధి చివరికి వెళ్లిన తరువాత మలుపు తిరగాలి. మళ్లీ మలుపు తిరగాలి. ఆ మలువంటా పోతే పాఠశాల కనిపిస్తుంది." క్లుప్తంగా ఇదీ ఆ వివరం.

ఆమె హృదయం కొద్దిగా కుదుట పడ్డది. శరీరం తేలిక అయింది. ఆమె ముఖంలో సంతోషరేఖలు విప్పారి వృష్టించాయి. హుషారు ఒంటి రక్తంలో అంతటా పాకింది. నీరసం, ఆయాసం ఆ స్థితిలో ఆమెను చూచి భయపడి పారిపోయాయి. శ్రమ ఇంకిపోయింది... వేగంగా అడుగులు పడుతున్నాయి.

ఏమబ్బా, అంత సంతోషం? హుషారు?

ఆమె చేరవలసిన గమ్యం చేరుకున్నది కాబట్టి!

మొదటి వీధి దాటింది. రెండవ వీధిలో ప్రవేశించింది. అచటి ప్రజలు ఆమెను వింతగా చూడ సాగారు. ఆ వెనకనే వస్తున్న అతన్ని మరీ వింతగా చూచారు. ఈ సారి ఇద్దర్నీ కలిపి వింతగా చూడసాగారు.

కారణం ఏమంటారు?

వాళ్ల తీరు తెన్నులు!

అంతే నంటారా?

అంతే!

అమ్మలక్కల బుగ్గలు సొట్టలు పడ్డాయి. చేతులు గడ్డాల కిందికి చేరుకున్నాయి. మూతులు అష్ట వంకరలు తిరిగాయి. కొందరు ఏవేవో అనుకున్నారు. కొందరు లోలో అనుకోసాగారు. అయినా అందరూ అలా నిశ్శబ్దంగా ఉండరుగా! ఎవరో ఒకరు పైకి గట్టిగా అనేశారు బిగబట్టలేక ఆ విషయాన్ని.

"మొగుడూ పెళ్లాల్లా ఉంది."

"ఈ ఊరిలో ఎవరింటికి వెళ్లుతున్నారో?"

"ఏమో!"

"చూడ్డానికి రతీమన్మథుల్లా ఉన్నారు!"

"తగ్గ ఈడూ జోడూ!"

"జోడా బాగా కుదిరింది!"

ఈ మాటలు సన్నగా ఆమె చెవిని పడ్డాయి ఆశ్చర్యపోయింది. అంతేకాని కోపగించుకోలేదు. గ్రామ ప్రజల అజ్ఞానానికి విచారించింది.

'ముందు గ్రామాలలో కూడా ఇలాగే అన్నారు. ఏమిటీ వింత? ఏమిటీ మాయ? వీళ్ల వైఖరి ఏమిటి? అతను, నేను భార్యా భర్తల్లా ఉన్నామా? ఛా! ఏమిటీ ఆలోచన! అయినా అతనంటే ఇదివరలా కోపం రాలేదేమిటి? అయినా కోపం రావలిసినంత చెడ్డ పని ఏం చేశాడని?

'అతను పాపం, ఎంత బుద్ధిమంతుడు!

'ఏం మాట్లాడడు! ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. ఎలా ఉంటాడో కూడా సరిగా చూడలేదు. ఇన్ని మైళ్ళు ఇద్దరం కలిసి ప్రయాణం చేసినా అతన్ని పరీక్షగా చూడలేదు. అయినా ఇప్పుడు వెనక్కి తిరిగి చూస్తే?

'ఛా! ఏమనుకొంటాడు అతను? ప్రజ లేమనుకొంటారు?

'అతనిది ఈ ఊరే కాబోలు! అయినా ఇంకా వెనకాలే వస్తున్నా డేమిటి? ఎవరి చుట్టమో! లేక ఇదే అతని స్వంత గ్రామమేమో? అయినా మన కెందుకులే అతని విషయం! ముందు పాఠశాలకు వెళ్లి చేరిపోయి ఆ వెనక చూద్దాం తతిమ్మా వాటి సంగతి!' అని అనుకొని ఇంకా వేగంగా నడవ సాగింది ఆమె.

మలుపులు గిలుపులు తిరిగి తిరిగి ఆమె పరిషత్తు హైస్కూలు వద్దకు చేరుకొన్నది.

## 5

"నమస్కారమండీ!" అంటూ ఆమె హెడ్‌మాస్టారు గారి గది లోపల అడుగు పెట్టింది.

"నమస్కారం!" అని ఏదో వ్రాసుకుంటున్న హెడ్ మాస్టారుగారు తలఎత్తి చూచారు.

ఆమెను చూస్తూ అలాగే కొయ్యబారిపోయారు అయిదు నిమిషాలు.

ఆయన అలాగే తన వంక రెప్పవేయకుండా చూడడం వల్ల ఆమెకు కొద్దిగా చిరాకెత్తింది. కానీ, అది పైకి కనిపించనీయలేదు.

కారణం ఏమంటారు?

ఆయన బాధ్యత కల హెడ్‌మాస్టారు కనక.

నిశ్శబ్దాన్ని భంగపరిచింది ఆమె గాజుల గలగల శబ్దం. ఆయన కొద్ది సిగ్గుతో ఆమెమీద నుంచి దృష్టి మరలించాడు. గౌరవంగా కూర్చోమని కుర్చీ చూపాడు. ఆమె నడిచి వెళ్లి కుర్చీలో కూర్చున్నది. ఆయన ఆమె అందచందాలు నెమరు వేయసాగాడు.

ఎర్రటి శరీరచ్ఛాయ. కోలమొగం. గుండ్రని కనుమొగ్గలు. పాలుగారు నునుపైన లేతబుగ్గలు. గులాబి పువ్వులాంటి ఎర్రటి పెదవులు. వాటికి లిప్‌స్టిక్ వ్రాసింది కాబోలు, మరీ ఎర్రగా కనిపిస్తున్నాయి. ముఖానికి పౌడరు అద్దింది కాబోలు, చాలా అందంగా కనిపిస్తున్నది. అయినా అక్కడక్కడ చెమట బిందువులు కనిపిస్తున్నాయి.

నుదుట తిలకం బొట్టు. చెవులకు స్టార్‌లు. మెడలో బంగారు నెక్లేసు. ఎడం చేతికి లేడీస్ రిస్టువాచీ. కుడి చేతికి గాజులు. ఈ చేతిలో బాగు. పొడుగైన చేతులు అవి. బెంగుళూరు చీరె సిల్కుది ధరించింది. దానికి తగ్గట్టు సిల్కు జాకెట్టు. సన్నటి పొడుగాటి వాలు జడ. జడలో మల్లెల చెండ్లు. కాళ్లకు స్లిప్పర్సు. సన్నని నడుం. సన్నగా పొడుగ్గా ఉన్నది. నాజూకుగా నిలుచున్నది. క్లుప్తంగా ఇదీ ఆమె శరీర వర్ణన.

ఆయనకు తన బాధ్యత గుర్తుకు వచ్చినది.

"మీరు...?" అని నాన్చుతూ అడిగారు ఆమెను హెడ్‌మాస్టారు.

"నేను హిందీ పండిట్‌నండీ! నాకు ఇక్కడ పని చెయ్యమని పరిషత్తునుంచి ఆర్డరు వచ్చిందండీ!"

"మీ పేరు కుమారి రాధామణి కదండీ!"

"అవునండీ!"

"ఇదే కొత్తా లేక, ఎక్కడైనా పని చేశారా?"

"లేదండీ! ఇదే కొత్త!"

"వెంటనే చేరతారా!"


"అవునండీ!"

"సరే! మీ సర్టిఫికెట్సు వగైరా చూపించండి"

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం (ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17




గౌర్ మోహన్ దాస్ అండ్ కం.,
233, పాత చైనాబజార్ వీధి,
కలకత్తా—1
ఫోన్: 22—6580




లిచెన్‌సా
వాడండి
DZ 1613 ATG

అని ఆమెను అడిగారు హెడ్‌మాస్టారు. ప్యూనును పిలిచి కాఫీకి ఆర్డరిచ్చారు కూడా.

ఆమె తన బాగు తెరిచి సర్టిఫికెట్లు వెతికి తీయ సాగింది. ఇంతలో "నమస్తే!" అంటూ లోపల అడుగు పెట్టాడు ఒకాయన. సర్టిఫికెట్లు తీసుకొంటున్న ఆమె తలఎత్తి చూచింది. ఆశ్చర్యపోయింది.

'అతనే! అదే చిరునవ్వు, అవే చూపులు, అదే వాలకం! అన్నీ అతనివే! కాని, ఇప్పుడు మాట్లాడింది ఇతనేనా?' అని సంభ్రమాశ్చర్యాలతో అనుకొన్నది ఆమె.

"నమస్తే!" అని హెడ్‌మాస్టారుగారు అతన్ని చూచి క్షణం చలించారు.

కారణం ఏమంటారు?

అతని అందచందాలే!

ఎర్రటి శరీరం. గుండ్రని మొగం. గుండ్రని చిలిపి కన్నులు. చిలక ముక్కు. మునువుదేలిన లేతబుగ్గలు. దొండపండు వంటి పెదవులు. తెల్లని బుష్ షర్టు ధరించాడు. దానికి తగ్గ తెల్లని ఫుల్ ప్యాంటు ధరించాడు. నెక్ టై. దానిపై ఫుల్ కోటు.

ఎడం చేతికి వాచీ. వేళ్లకు రెండు బంగారు ఉంగరాలు. కుడిచేతిలో జేబురుమాలు. విశాలమైన ఫాలభాగం. అప్పుడప్పుడు చెమట బిందువులు.

నొక్కుల జుట్టు. సన్నటి పాపిడి. కాళ్లకు ఫుల్ బూటు. కొద్దిగా లావుగా పొడుగ్గా ఉన్నాడు. ఠీవిగా నిలుచున్నాడు. క్లుప్తంగా ఇదీ అతని శరీర వర్ణన.

అతన్ని కూడా కూర్చోమని కుర్చీ చూపారు ఆయన. నెమ్మదిగా నడిచి వచ్చి ఆయన ముందుకల కుర్చీలో కూర్చున్నాడు అతను.

అతన్ని, ఆమెను మరీ మరీ చూచి ఆయన ఇలా అన్నారు:

"మీరు ఆవిడకు భర్త అవుతా రనుకుంటాను! మీ పేరు?" అని ప్రశ్నించారు ఆయన అతన్ని.

హెడ్‌మాస్టారి ప్రశ్న విని ముందుగా ఆశ్చర్య పోయింది ఆమె.

'ఏమి టీ వింత! వీరు కూడా మా ఇరువురికి సంబంధం కలిపా రేమిటి? ఎందువల్ల?

'ఓహో! అర్థమైంది. మే మిరువురం కలిసి వచ్చినట్లుగా ఒకరి వెనక ఒకరం వచ్చాం కాబట్టి.

'ఛా! ఇది కాదు కారణం!

'మరేమిటి?

'మా ఇరువురి వేషధారణ, తీరుతెన్నులు చూస్తే అలా అనిపిస్తుంది. అంతే! చూద్దాం, అతను ఏమం టాడో? మాటలు రావుగా!' ఇలా ఆమె అనుకొంటు న్నది.

"లేదండీ! మీరు పొరపడ్డారు! ఆమె ఎవరో నాకు తెలియదు. కాని, ఇరువురం వెనక ముందుగా వచ్చిన మాట నిజం" అని అతను నవ్వుతూ చెప్పాడు ఏ మాత్రపు అనుమానం కలగకుండా.

ఈసారి అతని జవాబు విని ముందుగా ఆశ్చర్య పోయింది ఆమె. క్షణం తనను తానే మరిచిపోయింది.

'ఏమిటి, అతను మాట్లాడతాడా! అందులో ఇంత చక్కగా సభ్యతా సంస్కారాలతో మాట్లాడతాడా! ఎంత సభ్యతగా మాట్లాడాడు! మాటలు రావు, మూగవా డనుకొన్నానే! నా అంచనా సరిఅయినది కాదన్నమాట!

'మరి, నాతో మాట మాత్రం మాట్లాడలే దేమిటి? ఎందువల్ల? మాట్లాడకూడదని అనుకున్నాడా కాబోలు! పోనీలే, ఇప్పటికైనా అతనికి మాటలు వచ్చునని తెలిసింది.

'అయినా అత నెవరో? ఎందుకు ఇక్కడికి వచ్చాడో? ఏమో! క్షణం ఆగితే తెలుస్తుందిగా!' అని సర్టిఫికెట్లు తీయడం ఆపి అనుకొన్నది ఆమె.

"అలాగాండీ!" అని అంటూ హెడ్‌మాస్టారుగారు కూడా తెల్లబోయారు.

క్షణం నిశ్శబ్దంగా దొర్లిపోయింది.

ఆయనకు తన కర్తవ్యం గుర్తుకు వచ్చి అతన్ని ఇలా అడిగారు:

"మీరు వచ్చిన కారణం ఏమిటో చెప్పండి?"

"నన్ను భద్రాచలంనుంచి ఇక్కడికి బదిలీ చేశారు. బహుశా మీకు ఆర్డర్సు ఈపాటికి అంది ఉండాలి!" అని అతను జవాబు చెప్పాడు.

బాగులోకల సర్టిఫికెట్లు వెతుకుతూ ఆమె ఇద్దరి సంభాషణ అతి జాగ్రత్తగా వింటున్నది.

వచ్చారన్నమాట. ఏమీ మాట్లాడుకోలేదంటారు. పాపం! చాలా దూరం నడిచివచ్చారు. అలిసిపోయి ఉంటారు. కాఫీ తెప్పిస్తాను,ఉండండి" అని ప్యూనును పిలిచారు ఆయన.

వెంటనే ఇందాకే కాఫీకి పంపినట్లు గుర్తు వచ్చింది. ఎవరో పిల్లవాణ్ణి పిలిచి కాఫీకి పంపి, వచ్చి తిరిగి తమ సీటులో కూర్చున్నారు ఆయన.

"ఇప్పుడే ఛార్జి తీసుకుంటారా?" అని అతన్ని ప్రశ్నించారు ఆయన హుషారుగా.

'ఛార్జా! ఛార్జేమిటి? ఇదో విచిత్రంగా ఉన్నదే!' అని అనుకొన్నదా ఆమె తెల్లబోయి.

"రేపు తీసుకుంటానులెండి!"

"ఒంటరిగా వచ్చారా? లేక, కుటుంబ సహితంగా వచ్చారా?"

"నాక్కు అసలు పెళ్లే కాలేదండీ!"

ఈసారి కూడా ముందుగా తెల్లబోయింది ఆమె.

'అతనికి ఇంకా పెళ్లి కాలేదూ? నేను ఇంకా అయిం దని అనుకొన్నాను. ఏమిటి నా అంచనాలన్నీ తారుమారు



అన్యోన్యం

కత్తిరింపు చిత్రం —కోరా సీతామహాలక్ష్మి (క్రోసూరు)

"ఐ సీ! మీ పేరు కృష్ణమూర్తి కదూ!"

"అవునండీ!"

"మరి చెప్పరేం! ఇందాకటినుంచీ నేను ఎవరో అనుకొంటున్నాను. విష్ యూ గుడ్ లక్!" అని అంటూ ఆయన తన కుర్చీనుంచి హుషారుగా లేచి అతని దగ్గరికి నడిచారు. ఇద్దరూ పరస్పరం కరచాలనం చేసుకున్నారు. ఆయన హుషారుగా అతని భుజం తట్టుతూ ఏవేవో అంటున్నారు.

అతి జాగ్రత్తగా సంభాషణ వింటూన్న ఆమె తెల్ల బోయింది.

'ఏమి టీ మాయ! ఇంద్రజాలం! మాటలు రావు అనుకుంటే చక్కగా సభ్యతతో మాట్లాడుతున్నాడు. ఎవరో అనుకుంటే నాలాగే టీచరు అని తెలిసింది. బహుశా బి. ఎ., బి. ఇ డి. అయిఉంటాడు. అందుకే హెడ్‌మాస్టారుగారు అంత హుషారుగా అతనితో మాట్లాడుతున్నారు' అని సర్టిఫికెట్లు తియ్యడం ఆపి అనుకొన్నది ఆమె.

"అయితే మీ రిద్దరూ చాలా దూరంనుంచి కలిసి

అవుతున్నాయి?' అని అనుకొన్నది ఆమె.

"ఐ సీ!" అని ఆయన అతన్ని ఒకమారు చూచి తిరిగి ఇలా అడిగారు:

"అయితే ఒక్కరే అన్న మాట!"

"కాదండీ! అమ్మా నాన్నా ఉన్నారు. అక్కలు, చెల్లాయిలు, తమ్ముళ్లు ఉన్నారండీ! అయినా మాది పెద్ద కుటుంబం లెండీ!"

"ప్రస్తుతం మీ రొక్కరే వచ్చారు కదూ!"

"అవునండీ!"

"ఏమీ వెంట తెచ్చుకోలేదూ?"

"లేదండీ!"

"సరే! బస, భోజనాలు వగైరాలకు ఏర్పాటు చేయి స్తాను. ఏమంటారు?"

"మీ ఇష్టం! అలాగే జరిపించండి."

వెంటనే ఆయన కుర్చీనుంచి లేచి గది బయటికి వచ్చి ఎవరో కుర్రాణ్ణి కేకేసి లోపలికి వచ్చారు. ఆ కుర్రాడు వచ్చాక అతనితో ఏవేవో మాట్లాడి పంపి వేశారు. తిరిగి ఇంకొకణ్ణి పిలిచి లాంగ్ బెల్ కొట్టమని

చెప్పారు. తిరిగి అతనితో కబుర్లు చెప్పసాగారు ఆయన.

స్కూలు విడిచిపెట్టబడింది. కొత్త టీచర్లు వచ్చిన విషయం స్కూలంతా పాకిపోయింది. పిల్లలందరూ హెడ్‌మాస్టరు గది వద్దకు చేరి తొంగి తొంగి చూస్తున్నారు.

"అరిగోరోయ్! కొత్తపంతులు. పంతులమ్మగారు కూడా ఉన్నారోయ్! చాలా బాగున్నారా!" అని గొడవ చేయసాగారు పిల్లలు. వాళ్ల గొడవ భరించ నంత బాధగా తయారైంది. హెడ్‌మాస్టరుగారు వాళ్లను గట్టిగా గదమాయించేసరికి నిశ్శబ్దంగా అక్కడి నుండి చల్లగా జారుకున్నారు పిల్లలు.

స్కూలు టీచర్సు అందరూ ఆ గదిలోకి వచ్చారు అంతలోనే.

"ఆయన కె. కృష్ణమూర్తి, ఎమ్. ఎ., బి. ఇడి. రేపటినుంచి స్కూలు అధికారులు. భద్రాచలంనుంచి హెడ్‌మాస్టరుగా ఇచ్చటికి బదిలీ చెయ్యబడ్డారు.

"ఆమె మిస్ వి. రాధామణి, సీనియర్ హిందీ పండిట్. కొత్తగా ఎపాయింట్ చేశారు. రేపటి నుంచి ఇచ్చటనే పని చేస్తారు."

క్లుప్తంగా వీళ్లిద్దరిని అందరి టీచర్సుకు పరిచయం చేశారు హెడ్‌మాస్టరు. అందరూ వాళ్లకు అభినంద నాలు తెలిపారు. తిరిగి వీళ్లిద్దరు వాళ్లకు అభినందనాలు తెలిపారు.

కొద్ది నిమిషాలు అందరు హుషారుగా గడిపారు. క్రమేపీ టీచర్స్ అందరూ మెల్లిమెల్లిగా జారుకోసాగారు. ఆఖరికి ఆ గదిలో ఆ ముగ్గురే మిగిలారు.

ఇంతలో ప్యూను కాఫీ తీసుకొని వచ్చి హెడ్‌మాస్టరు గారి బల్లమీద పెట్టాడు.

"కాఫీ తీసుకోండి!" అని ఆయన అతన్ని ప్రోత్సాహ పరిచారు.

"అబ్బే, వద్దండీ! ఇప్పుడే కదా తాగి వచ్చాను!"

"నో! నో! అలాగంటే కుదరదు! తప్పక తాగవలసిందే."

"మరి ఆమెకు?"

"సంపెనుగా కుర్రాణ్ని! ఈపాటికి వస్తూ ఉంటాడు. ముందు మీరు తాగండి."

"అయితే తీసుకుంటానులెండి!" అని ముందుకు వంగాడు అతను.

"ఇప్పుడే వస్తా, కాఫీ తీసుకుంటూ ఉండండి! చిన్న పని ఉంది" అని చెప్పి హెడ్‌మాస్టరుగారు గది విడిచి బయటికి పోయారు.

గదిలో ఆ ఇద్దరే మిగిలారు.

ఈ గందరగోళం అంతా మాయాజాలంగా కనిపించ సాగింది ఆమెకు. ఆమె ఆశ్చర్యపోయి అంతా చూస్తున్నది. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. అందరూ బయటికి వెళ్లాక కొద్దిగా విశ్రాంతి దొరికింది ఆమె మెదడుకు. సర్టిఫికెట్సు బ్యాగునుంచి తియ్యడం ఆపు చేసింది ఈ హడావిడిలో.

'ఏమి ఈ మాయ! ఆయన రేపటినుంచి హెడ్ మాస్టారు అన్నమాట స్కూలుకు! అంటే నేను రేపటి నుంచి ఆయన చెప్పినట్లు నడవాలి అన్న మాట. ఎలా? నేను అన్న మాటలు అన్నీ జ్ఞప్తిలో ఉంచుకొని నా మీద లేనిపోని నిందలు మోపితే ఆయన? నా బ్రతుకేంకాను?

'అవతల మనిషి ఎవరో? ఏంచేస్తారో? అన్న వివరాలు తెలియకుండా వాళ్లమీద అనవసరంగా నేరాలు మోపడం తెలివితక్కువ పని! నా మాటలు అనడం మరీ నీచమైన పని. వాళ్ళతో తెలియకుండా మాట్లాడడం మరీ తప్పు.

'ఇప్పుడు ఎలా? ఎలా? ఒకటే మార్గం! క్షమాపణ చెప్పుకోవడమే!' అని అనుకొని ఆమె అతనికేసి చూచింది. అతను సరిగ్గా అప్పుడే ఆమెకేసి చూచాడు.

ఇద్దరి కన్నులు కలిశాయి. నాలుగుకళ్లు ఏవేవో మాట్లాడుకున్నాయి. అతని చిరునవ్వు ఆమెను మరీ సిగ్గుపడేటట్లు చేస్తున్నది. చప్పున తల దించుకొన్నది.

"మిస్ రాధామణిగారూ!" అని అతను ఆమెను పిలిచాడు.

అతని పిలుపు విని ఆమె దిగ్భ్రాంతి చెందింది. ఈ మాట కోసమే చాలాసేపునుంచి ఎదురు చూస్తున్న ఆమె తల ఎత్తి చూచింది.

"కాఫీ తీసుకోండి!" అంటూ గ్లాసు ఇవ్వబోయాడు అతను ఆమెకు.

"ఎందుకండీ నాకు, వద్దు. మీరు తీసుకోండి."

"నేను తీసుకుంటున్నాను కూడా. ఇదిగో! ఇలా చూడండి" అని ఆమెకు తన సాసరు చూపించాడు.

చిత్రమేమంటే అతను కాఫీని రెండు భాగాలుగా చేశాడు. కొంత గ్లాసులో పోశాడు. కొంత సాసరులో పోశాడు. అంటే చెరిసగం చేశాడన్న మాట కాఫీని.

ఆమె చూచింది. కాని, ఏం మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఊరుకొన్నది. తల వంచి ఆలోచిస్తున్నది.

పాపం! ఆమె ఏవేవో ఊహించుకొంటూ ఏదో బాధ పడుతున్నది. మానవ జీవన సంగ్రామంలో ఇలాంటి వారు ఎంతమందో! లజ్జ ఆమెను అణగదొక్కుతున్నది. స్థితిగతులు ఆమెను అటూ ఇటూ ఊపుతున్నాయి.

"ఏమండోయ్!" అని గట్టిగా పిలిచాడు ఆమెను అతను.

"ఏమిటండీ!" అంటూ అతన్ని చూచింది ఆమె ఆలోచనలనుంచి తేరుకొని.

"కాఫీ తీసుకోండి!" అంటూ గ్లాసు ఇవ్వబోయాడు అతను ఆమెకు.

క్షణం ఏమీ చెయ్యలేకపోయింది ఆమె.

"మీరు ఏవేవో ఊహించుకొని బాధపడుతున్నారులాగుంది. అవన్నీ మరిచిపోండి. పాత పాతే! కొత్త కొత్తే! అన్నారు పెద్దలు. పాత మరిచిపోండి. కొత్తగా జీవించండి. మీ రలా బాధపడడానికి కారణం ఒక్కటే! అదే, మీకు లోకజ్ఞానం తెలియకపోవడమే!

"ఇప్పటినుంచి అధికారం, హోదాలు మరిచిపోయి మనం ఇద్దరం పరస్పరం కలిసి స్నేహితులుగా మసులు కుందాం! ఏమంటారు? అయినా ముందు కాఫీ తీసుకోండి!" అని అతను ఆమెకేసి చూచాడు.

ఏమంటుంది? అతని నిర్మల హృదయానికి, సభ్యతకు ఆమె హృదయం లొంగిపోయింది. జోహారులు అర్పించింది ఆమె. నిజమా అన్నట్లు అతనికేసి చూచింది.

"నిజం! నా మాట నమ్మండి!"

నమ్మినట్లు ఆమె తల ఊపింది.

"అయితే త్వరగా కాఫీ తీసుకోండి!" అని చిరునవ్వుతో గ్లాసు అందించాడు అతను ఆమెకు.

అతని సభ్యతకు, సంస్కారానికి ఆమె తెల్లబోయి అతని చేతినుంచి కాఫీ గ్లాసు తీసుకున్నది. ★

# స్వాగత గీత

**చందూ**

వాసంత కాంతా ని
తాంత సుందర వనము,
ఆశాంత దీవ్యల్ల
తాంత వికసిత మయ్యె.

విరుల ఎద గుప్తమౌ
పరిమళమ్ముల నెల్ల
పిల్ల తెమ్మెర మూక
కొల్లగొని పంచె నిల.

తెలివెన్నెలలు కన్నె
వలపు తలపుల వోలె
ఇలనంత గిలిగింత
లిడి పులక లెత్తించె.

క్రొమ్మావి కెమ్మావి
చవిగొన్న పుంస్కికము
కొమ్మ యొడి పరవశత
ప్రణయ గీతము పాడె.

రావోయి! నీకు స్వా
గత మిదోయి వసంత!
రాగమయి మా తెలుగు
బాల నిను పిలిచినది.

నీ రాక నీ లోక
మే నాక మై మురిసె!
అణువణువు నొక మల్లె
యై హాయిగా విరిసె! *